క్లుప్తంగా

నిత్యావసర సరుకులు పంపిణీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ధర్‌లొద్దీ గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లేని సిడాం సుశీల వివాహం గురువారం జరిగింది. తల్లిదండ్రులు లేని విషయాన్ని తెలుసుకున్న సామాజికవేత్త ముదుపు మౌనిష్ రెడ్డి భోజనం కోసం తన వంతుగా నిత్యావసర సరుకులు అందజేసి అండగా నిలిచారు. దీంతో గ్రామస్తులు, ఆమె బంధువులు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆశన్న యాదవ్, సురేందర్ రెడ్డి, సాగర్ రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

అలరించిన వీడ్కోలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో గురువారం వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సినీ, జానపద గీతాలపై చేసిన నృత్యం ఆకట్టుకుంది. తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థులు వారి అనుభవాలు, అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ అతీఖ్ బేగం మాట్లాడుతూ కష్టపడి చదివి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, సూపరింటెండెంట్ కరుణాకర్, నరేశ్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనం రూ. 307కు పెంచాలి

ఆదిలాబాద్‌రూరల్: ఉపాధి హామీ కూలీలకు రూ. 307 ఇవ్వాలని వైకాస జిల్లా కార్యదర్శి లంక రాఘవులు అన్నారు. గురువారం మండలంలోని యాపల్‌గూడ శివారు ప్రాంతాంలో కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు వారాలకు సంబంధించిన కూలీ డబ్బులు రావడం లేదని కూలీలు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఎండలు మండిపోతుంటే కనీసం తాగేందుకు నీటిని అందించడం లేదన్నారు. రూ. 307 కూలీ ఇవ్వాలి కానీ కేవలం రూ. 120 నుంచి రూ. 130 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఆయన వెంట వైకాస జిల్లా అధ్యక్షులు స్వామి, గంగారాం, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం భుక్తాపూర్ కాలనీకి చెందిన దుర్గే చంద్రకాంత్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ. 52వేల చెక్కును గురువారం కంది శ్రీనివాసరెడ్డి అందజేశారు. లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు అందజేశారు. అలాగే కాలనీలో ఇటీవల మృతి చెందిన వ్యక్తి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట వార్డ్ మాజీ కౌన్సిలర్ బండారి సతీష్, గిమ్మ సంతోష్, రాహుల్, అహ్మద్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

సిరికొండ: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నర్సపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి హిమబిందు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కేజీబీవీలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌హెచ్‌వో సంధ్యరాణి, సీహెచ్‌వో మహేశ్, సుశీల, స్వప్న, జ్యోతి పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

కైలాస్‌నగర్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి టీ ఎన్జీవోస్ సభ్యత్వాన్ని తీసుకోవాలని ఆ యూనియన్ ఆదిలాబాద్ అర్బన్ ప్రధాన కార్యదర్శి కొమ్రేవార్ అరుణ్ కుమార్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సంఘ సభ్యత్వ నమోదు చేపట్టారు. మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, జి.శ్రీనివాస్, ఖలీం, తేజ పాల్గొన్నారు.

షాదీఖానా అభివృద్ధికి చర్యలు

కైలాస్‌నగర్: ముస్లిం మతపెద్దలు, మైనార్టీ ప్రతినిధులు ప్రస్తావించిన ప్రతీ అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మనోహర్ రావు హామీనిచ్చారు. ఆదిలాబాద్ పట్టణంలోని పుత్లీబౌలి షాదీఖానా అభివృద్ధిపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, మైనార్టీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారి నుంచి సలహాలు, సూచనలను స్వీకరించారు. సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, యూనిస్ అక్బానీ, సాజిదొద్దీన్, సాజిద్‌ఖాన్, రషీద్ పాల్గొన్నారు.

పండ్ల రసాలకు భలే గిరాకీ

- సూర్యతాపంతో పెరిగిన విక్రయాలు
- జ్యూస్ సెంటర్లు, ఐస్‌క్రీం పార్లర్లలో రద్దీ
- ఎండ నుంచి ఉపశమనం పొందుతున్న జనం



ఐస్‌క్రీం ఫ్లేవర్లతో జ్యూస్‌లు



ఐస్‌క్రీం పార్లర్‌లో జనాల సందడి

కైలాస్‌నగర్: జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. ఎండ తీవ్రత పెరగగా.. గతంలో ఎన్నడూ లేని విధంగా వేడి గాలులు వీస్తున్నాయి. దీంతో ఉదయం 11 అయిందంటే చాలు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే భానుడి ప్రభావంతో తీరని దాహం వేస్తుంది. పదేపదే నీళ్లు తాగిన ఎంతకు దాహార్తి తీరడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానీయాల వైపు ఆసక్తి చూపుతున్నారు.

జ్యూస్ సెంటర్లకు డిమాండ్..

కూల్‌డ్రింక్స్‌కు బదులుగా పండ్ల రసాలు, చెరుకు జ్యూస్, కొబ్బరి బొండాలపై మక్కువ చూపుతున్నారు. దీంతో జ్యూస్ సెంటర్లు, ఐస్‌క్రీం పార్లర్లు జనాలతో రద్దీగా మారుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వీటికి మరింత డిమాండ్ పెరిగే అవకాశముంది. ప్రజల డిమాండ్ కనుగుణంగానే పల్లె, పట్టణ ప్రాంతాల్లో జ్యూస్ సెంటర్లు విరివిగా వెలిశాయి. జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌తో పాటు మండల కేంద్రాల్లోనూ వాటిని ఏర్పాటు చేశారు. పట్టణంలో ప్రధానంగా బస్టాండ్ ప్రాంతంతో పాటు కలెక్టర్‌చౌక్, స్టేడియం, పార్కురోడ్, ఎన్టీఆర్ చౌక్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా జ్యూస్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. ద్రాక్ష, కర్బూజ, ఆపిల్, ఆరెంజ్, మామిడి, పైనాపిల్ వంటి పండ్ల రసాలతో పాటు మిక్స్‌డ్ ఫ్రూట్స్‌తో తయారు చేసిన ఫ్రూట్ సలాడ్, పెరుగుతో తయారు చేసే లస్సీ కూడా విక్రయిస్తున్నారు. వివిధ రకాల జ్యూస్‌లను రూ.30 నుంచి రూ.120వరకు విక్రయిస్తున్నారు. జ్యూస్‌లతో పాటు ఐస్‌క్రీంలకు సైతం డిమాండ్ పెరిగింది. ఐస్‌క్రీంలను ఫ్లేవర్ల ప్రకారంగా రూ.120 నుంచి రూ.200వరకువిక్రయిస్తున్నారు.



వేసవిలో భానుడివేడి నుంచి ఉపశమనం పొందడంలో కొబ్బరిబోండాలు ఎంతో ఉపకరిస్తాయి. ఎండ తీవ్రతకు శరీరం వేడెక్కి దాహం వేస్తోంది. కొబ్బరి నీళ్లు సేవించడం ద్వారా అందులోని ఖనిజాలు, విటమిన్లు

కొబ్బరిబోండాలపై మక్కువ

శరీరానికి వేడిని తగ్గించి చల్లదనాన్ని ఇవ్వడంలో తోడ్పడుతాయి. ఆరోగ్య సంరక్షణకు సైతం ఎంతో తోడ్పడే కొబ్బరిబోండాలపైన జనం మక్కువ చూపుతున్నారు. ప్రధానంగా ఎన్టీఆర్‌చౌక్, కలెక్టర్‌చౌక్ ప్రాంతాల్లో వీటి విక్రయాలు ఎక్కువగా చేస్తున్నారు.

వ్యాపారం బాగుంది



మా జ్యూస్ సెంటర్ ఏడాది పాటు నడుస్తోంది. అయితే ప్రతీ ఏటా వేసవిలోనే ఎక్కువగా గిరాకీ ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే కొద్దీ తమ షాపుకు వచ్చే ప్రజల రద్దీ కూడా పెరుగుతుంది. వివిధ రకాల పండ్ల రసాలతో పాటు డ్రైఫ్రూట్స్‌తో అన్ని ఫ్లేవర్లతో కూడిన ఐస్ క్రీంలను విక్రయిస్తాం.

– రాజు, ఐస్‌క్రీం పార్లర్ నిర్వాహకుడు

విక్రయాలు పెరిగాయి



గత రెండేళ్లుగా కొబ్బరిబోండాలను విక్రయిస్తున్నా. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కొబ్బరిబోండాలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో బోండను రూ.40కి విక్రయిస్తుండగా లీటర్ నీళ్లను రూ.180 నుంచి రూ.200కు అమ్ముతున్నాం. సాయంత్రం ఎక్కువగా గిరాకీ ఉంటుంది.

– అహ్మద్, కొబ్బరిబోండాల విక్రయదారు

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు

నేరడిగొండ: అర్హులైన వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం ఎంపీడీవో సమావేశ మందిరంలో 32 గ్రామ పంచాయతీల ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు కాగా, మండలానికి 335 మంజూరైనట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామపంచాయతీల వారిగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన విషయాలను వివరించారు. ఎంపీవో లక్ష్మణ్, ఆయా గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపికను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం ఇంద్రవెల్లి, మెండపల్లి రైతువేదికలో వేర్వేరుగా ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, పంచాయతీరాజ్ ఏఈ ప్రభు కిరణ్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఈవో సంజీవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌వీర్

అర్హులను గుర్తించడంలో పారదర్శకత పాటించాలి

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించడంలో పారదర్శకత పాటించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మా ట్లాడారు. గతంలో సర్వే ఆధారంగా భవిష్యత్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చే యనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు. ఇందిరమ్మ కమిటీలో సభ్యులుతో పాటు అధికారులు ఉంటారని తెలిపారు. సమావేశంలో ఎంపీవో సత్యానంద్, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలప పట్టివేత

సిరికొండ: మండల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ముందస్తు సమాచారం ప్రకారం కార్పెంటర్ ఇళ్లల్లో సోదాలు నిర్వహించగా సుమారు రూ. 10 వేల విలువ చేసే కలపను పట్టుకున్నట్లు మండల అటవీ శాఖ అధికారి నాగవత్ స్వామి తెలిపారు. పట్టుకున్న కలపను అటవీ శాఖ కార్యాలయానికి తరలించి, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా కలప తరలించిన, నిల్వ చేసినా.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీట్ అధికారి కలేందర్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలు సందర్శించిన డీఈవో

ఆదిలాబాద్‌రూరల్: యూడైస్ సర్వే పర్యవేక్షణలో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి ఏ. శ్రీనివాస్‌రెడ్డి గురువారం మండలంలోని అంకోలి జెడ్పీఎస్ఎస్, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. వర్షపునీరు వృధాగా పోకుండా ఇంకుడు గుంతలను తవ్వించాల ని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు నాప్కిన్స్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కంటె నర్సయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఆశ కిరణ్, సెక్టోరల్ అధికారి జెట్టి నారాయణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

తలమడుగు: రైతులు అధిక దిగుబడి సాధించేందుకు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి ప్రమోద్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సుంకిడి, తలమడుగు, కజ్జర్ల గ్రామాల్లో విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు మంచి కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలన్నారు. రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు.



తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి ప్రమోద్‌రెడ్డి

'చలో ఇంద్రవెల్లి' పోస్టర్ ఆవిష్కరణ

నార్నూర్: ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద చలో ఇంద్రవెల్లి పోస్టర్ ఆవిష్కరించారు. అమరవీరుల సంస్మరణ సభ విజయవంతం చేసేందుకు ఆదివాసీలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అమరుల ఆశయ సాధనతో పాటు హక్కుల సాధన కోసం కృషి చేయాలని అన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఈశ్రు, మాడవి జైవంతరావు, కనక హన్మంతరావు, కోట్నాక్ శ్రీరాం, జుగ్నాక భీంరావు, పెందూర్ విష్ణు పటేల్ పాల్గొన్నారు.

సంస్మరణ సభ ఏర్పాట్లు..

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద ఈనెల 20న అధికారికంగా నిర్వహించే అమరుల సంస్మరణ సభ ఏర్పాట్లను అధికారులు గు రువారం ప్రారంభించారు. విద్యుత్ సరఫరా, తాగునీరు పనులు చేపట్టారు. ఆదివాసీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐటీడీఏ అధికారులు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సన్నబియ్యంతో పేదల ఇంట్లో ఆనందం

నార్నూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీతో నిరుపేదల ఇంట్లో ఆనందం ఉందని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని బొడ్డిగూడ గ్రామానికి చెందిన రాథోడ్ గణపతి, రాధాబాయి నివాసంలో సన్న బియ్యంతో వండిన భోజనం చేశారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో పౌష్టిక విలువలు ఎక్కువ ఉన్నాయన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మధుసూదన్, ఆర్ఐ విలాస్, ఎంపీవో రమేశ్ పాల్గొన్నారు.



సన్న బియ్యంతో భోజనం చేస్తున్న ప్రత్యేకాధికారి ప్రభాకర్, ఎంపీడీవో శ్రీనివాస్

మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలంలోని పూసాయిలో శుక్రవారం భూ భారతి చట్టంపై ఏర్పాటు చేసిన సదస్సుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా భోరజ్ తహసీల్దార్ రాజేశ్వరి రాథోడ్ గురువారం సభ స్థలిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి రాథోడ్

వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ప్రైవేట్ ఆసుపత్రుల్లోని వైద్య ఖర్చును ప్రభుత్వమే భరించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 40 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. ఐదు లక్షల నుంచి రూ. పది లక్షలకు పెంచిందన్నారు. ఈ వాగ్దానాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలన్నారు. అదే విధంగా నిరుపేదలకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే ప్రైవేట్ దవాఖానాల్లో రూ . లక్షల్లో బిల్లులు అవుతున్నాయన్నారు. అదే విధంగా లబ్ధిదారులు సంక్షేమ పథకాల విషయంలో మధ్యవర్తుల మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, కరుణాకర్ రెడ్డి, జోగు రవి, రఘుపతి, అశోక్ రెడ్డి, భీమ్ సేన్‌రెడ్డి, రాజేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులు ప్రపంచంతో పోటీపడాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు ప్రపంచంతో పోటీపడాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ కల్చర్, స్పోర్ట్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ ప్రతాస్‌సింగ్, వైస్ ప్రిన్స్‌పాల్ సాయి ప్రసాద్, అధ్యాపకులు రాణి, అనిత, ముజీబ్, స్వామి, చంద్రశేఖర్, కరుణాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

'కక్ష సాధింపు చర్యలు సరికాదు'

ఇంద్రవెల్లి: దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడం సరికాదని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ కేసుల పేరుతో వేధింపులకు గురి చేయటాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశంలో కాంగ్రెస్ బలపడుతుందని ఇలా ఈడీ కేసులతో ఇబ్బందికి గురి చేస్తే ఊరుకోమన్నారు.

అమరువీరుల సంస్మరణ సభ ఏర్పాట్లు పరిశీలన

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద ఈనెల 20న నిర్వహించే అమరుల సంస్మరణ సభ ఏర్పాట్లను గురువారం కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి సారిగా అధికారికంగా సంస్మరణ సభ నిర్వహించడంతో ఆదివాసీ సమాజం హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. అమరవీరుల స్తూపం వద్ద స్మృతి వనం ఏర్పాటుకు కోటి రూపాయలు కేటాయించడంతో పాటు అమరుల కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే బాధ్యతలు తీసుకున్నారన్నారు. ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీర్జా యాకుబ్‌బేగ్, పరత్ వాగ్ విశాల్, లక్ష్మీబాయి, గోపీనాథ్, ఫీరాజీ, గణేష్, నారాయణ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పశువులకు టీకాలు వేయించాలి

తాంసి: రైతులు తమ పశువులకు తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో గాలికుంటు టీకాల శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సిబ్బందితో కలిసి పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది సతీశ్, గోపాలమిత్రలు ప్రవీణ్, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో గురువారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ప్రతీ ఏటా పశువైద్యాశాఖ ద్వారా వేసవిలో గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు పశువైద్య సిబ్బంది గజనంద్ తెలిపారు. ముందస్తు టీకాలు వేయడం ద్వారా వర్షకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడవ్ మారుతి, గ్రామస్తులు పాల్గొన్నరు.



టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తాంసి: చిన్నారులు, గర్భిణులు, మహిళలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని మహిళ సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. గురువారం మండలంలోని గోట్కూరి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలతో పాటు పోషక విలువలు ఉండే ఆహార పదార్థాల ప్రదర్శన చేశారు. గుడ్లు, ఆకుకూరలు, పండ్లు అధికంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో లింగయ్య, జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

బోథ్: మండలంలోని బాబెరతండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రూప్‌చంద్ పెద్దమ్మ ఇటీవల మృతి చెందడంతో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఆయనను పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. బండారి శ్రీధర్ రెడ్డి, స్వామి, బొడ్డు శ్రీనివాస్, ఎలుక రాజు ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బోథ్: మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన మడావి జల్లు(60) ఇచ్చోడ గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇచ్చోడలో బుధవారం రాత్రి మృతి చెందాడు. ఆయన కుటుంబీకులు ఎవరూ లేకపోవడంతో పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడప నగేశ్, ఇచ్చోడ మండల మాజీ వైస్ ఎంపీపీ జలై జాకు, కొత్తూరు లక్ష్మణ్, బోథ్‌కు చెందిన మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్‌లు అంత్యక్రియలు నిర్వహించారు.

సన్మానం

కైలాస్‌నగర్: ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లి కంటి సత్యంను సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామస్తులు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. పట్నాపూర్‌లో రూ. 2 కోట్ల 97 లక్షల 18 వేలతో విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ అప్క కిషన్, మాజీ సర్పంచ్ పంద్రం సుగణ, అర్క రవీందర్, నారాయణ, నాథం, సంజీవ్, కిషన్ పాల్గొన్నారు.